క్లుప్తంగా

నేత్రపర్వంగా మల్లీశ్వరస్వామి రథోత్సవం


రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో ఆదివారం సాయంత్రం మల్లీశ్వరస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తులు అరటిపండ్లు, తమలపాకులు రథంపై వేసి మొక్కులు తీర్చుకున్నారు. సమీప మండల వాసులే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ కృష్ణమూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరభద్రస్వామి ఉచ్చాయం వేడుకలు


తట్రకల్లులో వీరభద్రస్వామి ఉచ్చాయం లాగుతున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో భద్రకాళిసమేత వీరభద్రస్వామి ఉచ్చాయము లాగు వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, గంగపూజ, మధ్యాహ్నం అన్నదానం,తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, అర్చకులు తెలిపారు.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు


రాయదుర్గం: అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: మహా శివరాత్రిని పురస్కరించుకుని రాయదుర్గం నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలన్నీ ఆదివారం భక్తులతో నిండిపోయాయి. పండుగ పర్వదినం సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని బీటీపీ రోడ్డు లో వెలసిన బసవేశ్వర స్వామి ఆలయం వద్ద కలుగోడు సర్పంచ్ హెచ్ కవిత, జెడ్పీ మాజీ సభ్యుడు హెచ్ వన్నప్ప ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నగరేశ్వర స్వామి కల్యాణోత్సవం


ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కళ్యాణదుర్గం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఉదయం 10.15 నుంచి 12.15 మధ్య నగరేశ్వరస్వామి, కాత్యాయనిదేవి, కామాక్షిదేవి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే స్థానిక ఆర్డీటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

అదుపులోకి మంటలు

కుందుర్పి: జంబుగుంపల అటవీప్రాంతానికి పశువుల కాపర్లు నిప్పు పెట్టడంతో వందల ఎకరాల్లో పచ్చదనం కాలిపోయింది. ఆదివారం అటవీశాఖ బీట్ అధికారి పరమేశ్వరప్ప, సిబ్బంది, కెంచంపల్లి మేకల కాపరులు ఎట్టకేలకు మంటలను ఆర్పివేశారు. దీంతో 3వేల ఎకరాలు అడవి అగ్నికి ఆహుతి కాకుండా కాపాడారు. మేకల కాపరులు నాగన్న, రఘు, ఓబులేసు, రామాంజనేయులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి మహర్దశ

- చురుగ్గా 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం
- విప్ కాపు చొరవతో మారుతున్న ఆస్పత్రి రూపురేఖలు


నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల రూపురేఖలు మారనున్నాయి. 30 పడకలున్న ఆస్పత్రిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.17 కోట్ల నిధులతో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి పరుస్తోంది. ప్రస్తుతం ఆస్పత్రి భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో దశాబ్దాల రాయదుర్గంవాసుల కల నెరవేరబోతుంది. ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వసతులు కల్పిస్తూ పేదలకు మెరుగైన వైద్యం అందజేస్తున్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే 16 మంది ప్రత్యేక వైద్య నిపుణులు, 27 మంది స్టాఫ్ నర్సు పోస్టులతోపాటు అత్యాధునిక వైద్య సేవలు ప్రజలకు అందుతాయి.

ఇక మెరుగైన వైద్య సేవలు..

రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు మెరుగైన వైద్య సేవలకు కమ్యూనిటీ వైద్యశాలపైనే ఆధారపడ్డారు. అత్యవసర కేసులయితే పొరుగున ఉన్న బళ్లారి లేదా వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతపురం సర్వజనాస్పత్రికి రెఫర్ చేసేవారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో ఆస్పత్రిలో పడకల స్థాయి పెంపుతో పాటు ఏరియా ఆస్పత్రిగా రూ.17 కోట్ల నిధులతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం జరుపుకుంటోంది. భవన నిర్మాణం పూర్తయి ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఇక సీరియస్ కేసులకూ ఇక్కడే చికిత్స అందించేందుకు మార్గం సుగమమవుతుంది. మరోవైపు ప్రస్తుతం నడుస్తున్న ఆస్పత్రిలో టీడీపీ హయాంలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వెంటాడేది. అప్పటి ఈ ప్రాంత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషితో వంద పడకల ఆస్పత్రి ఇంకా అందుబాటులోకి రాకముందే ఐదారు గురు స్పెషలిస్ట్ వైద్యులు, పూర్తిస్థాయి నర్సులతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. రాయదుర్గం ఆస్పత్రి రూపురేఖలు మారుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

రాయదుర్గం: త్వరలో జరగబోయే రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన 'సాక్షి' తో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోకుండా క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరును కలిసి సీఎం జగన్ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించాలన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని గుర్తుచేయాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒకేసారి 1.30 లక్షల శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంతటి మేలు చేసిన ప్రభుత్వానికి మేధావులు, ఉద్యోగులంతా అండగా నిలవాలన్నారు. వరుస ఓటములతో ఖంగుతిని వెంటిలేటర్ పై ఉన్న టీడీపీ కి 2024 ఎన్నికలే చివరివి కానున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని ముందే భావించి ఆ పార్టీ జాతీయ, ప్రాంతీయ అధ్యక్షులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలకు ఎవరూ మోసపోవద్దన్నారు. సామాన్య ప్రజలే ఆ పార్టీని విశ్వసించలేదని దుయ్యబట్టారు. మేధావులు, ఉద్యోగులు ఆలోంచి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా మరింత విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టబోతామని, పట్టభద్రులు, ఉపాధ్యాయులు వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు


రాయదుర్గం టౌన్: శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మరాఠా సంఘం సభ్యులు


కణేకల్లు: ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం రాయదుర్గంలో ఘనంగా నిర్వహించారు. మరాఠా సంఘం ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరాఠా సంఘం అధ్యక్షుడు శంకర్‌బాబు, కార్యదర్శి హరికృష్ణరావు, సభ్యులు రిటైర్డ్ ఏడీఈ రాజేంద్రప్రసాద్, జయసింహరావు, రామకృష్ణ, భవానీశంకర్, సుధాకర్, వంశీ, సాయివిశాల్ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లులో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కటిక వీధి నుంచి బస్టాండ్ వరకూ ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని బంగారు రథంలో ఉంచి ఊరేగించారు. ఆరెకటిక సంఘం అధ్యక్షుడు యువరాజ్, ఉపాధ్యక్షుడు కిశోర్, కోశాధికారి ఆనంద్, నాగభూషణం, చంద్ర, జ్ఞానేశ్వర్ రావు, మాల్యం చంద్ర, శంకర్‌రావు, అశోక్, దేవా, హీరా, ఉదయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజా కల్యాణోత్సవం


రాయదుర్గంటౌన్: గిరిజా కల్యాణోత్సవ దృశ్యం


కూడేరు: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు


వజ్రకరూరు: పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవ దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కురిహినశెట్టి కల్యాణమంటపంలో కుర్నీ సమాజ ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజా (శివపార్వతుల) కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. సప్తహారతుల సేవ, అన్నదానం నిర్వహించి సాయంత్రం స్వామి, అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కుర్నీ సేవా సమాజ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం సంగమేశ్వరుడి కళ్యాణం..

కూడేరు: స్థానిక జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం వేకువజామున శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పురోహితులు కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను అర్చకుడు మహేష్ ఇంటి నుంచి పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా జోడు లింగాల ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం భక్తజన సమూహం నడుమ శివపార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణంన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా ..

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో పార్వతీ పరమేశ్వరల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్రాభిషేకాలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌లో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రామయ్యస్వామి, శేషస్వామి, పార్థసారధిస్వామి, భక్తులు పాల్గొన్నారు. అలాగే భోగేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి స్వామి మహాకాళేశ్వరుడుగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం


చంద్రమౌళీశ్వరస్వామి ఊరేగింపు


కళ్యాణదుర్గం: శివపార్వతుల గ్రామోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని కె.పి.దొడ్డి గ్రామంలో చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అధిష్టించి గ్రామంలో ఊరేగించారు. రథోత్సవం ముందు భాగంలో యువకులు నందికోళ్లతో నృత్యం చేశారు. రథోత్సవాన్ని తిలకించడానికి గ్రామప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. అలాగే సోమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడులకను ఘనంగా నిర్వహించారు.

భవానీ శంకరుడి గ్రామోత్సవం..

కళ్యాణదుర్గం: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక భవానీ శంకరాలయంలో ఆదివారం శివపార్వతుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ, కళాకారుల బృందాలచే నృత్య ప్రదర్శనలతో భవానీ శంకరాలయం నుంచి శివ పార్వతులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గవిమఠం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే విశ్వకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న గవిమఠం సహాయ కమిషనర్

ఉరవకొండ: పట్టణంలోని గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని ఆదివారం గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ ఆహ్వానించారు. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యేకు వారు వివరించారు. భక్తులకు తాగునీరు, భోజనం తదితర వసతులు కల్పించి, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

మద్దానేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం రేపు

- అదే రోజు పశువుల జాతర ప్రారంభం


అలంకరణలో మద్దానేశ్వర స్వామి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో మద్దానేశ్వరస్వామి పశువుల జాతర, రథోత్సవ కార్యక్రమాలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. ఆదివారం ఆలయంలో రుద్రాభిషేకం, సహస్రబిల్వార్చన తో ప్రత్యేక పూజలు గావించి, స్వామి రథోత్సవానికి కలశస్థాపన గావించారు. 20వ తేదీ గంగ పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రకహోమం, పూర్ణాహుతి, మహా మంగళారతి నిర్వహిస్తారు. 21వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. మార్చి 1న నిర్వహించే ముత్యాలపల్లకి ఉత్సవం, లంకాదహనంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షులు తెలిపారు. అలాగే అదేరోజు పశువుల జాతర ప్రారంభం కానుండడంతో అనేక ప్రాంతాల నుంచి రైతులు వచ్చి పశువులను కొనుగోలు చేస్తుంటారు. 11 రోజుల పాటు ఉత్సవాలకు వచ్చే వారికి ఆలయ కమిటీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం.

ప్రారంభమైన రంగనాథుడి ఉత్సవాలు


అలంకరణలో ఎణ్ణె రంగనాథేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎణ్ణె రంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత) ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామికి ఉదయం వేదావతి హగరి నది నుంచి గంగను ఊరేగింపుగా తీసుకొని వచ్చి గంగపూజ, రుద్రాభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 5.45 గంటలకు పల్లకీ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు రంగనాథేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉరవకొండ: స్థానిక మల్లీశ్వరస్వామి ప్రాంగణంలో అమ్మతొలి దైవం సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ కళాకారుడు పాటిల్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలు చేశారు. అలాగే పరమశివుడి మీద చిత్ర గీతాలకు చిన్నారులు అద్భుత ప్రదర్శన చేశారు. అనంతరం ప్రతిభ చూపిన పలు చిన్నారులకు బహుమతులు అందించారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


మొదటి బహుమతి అందజేస్తున్న రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ప్రణయ్ రెడ్డి

కూడేరు: మండలంలోని మరుట్ల–3 కాలనీలో ఆదివారం చితంబరేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రణయ్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు వృషభాలు విజేతలుగా నిలవగా తర్వాత స్థానాల్లో గార్లదిన్నెకు చెందిన పరమేష్ వృషభాలు, మర్తాడుకు చెందిన రాఘవ వృషభాలు, రాయదుర్గానికి చెందిన వీరేష్ వృషభాలు నిలిచాయి. విజేతలకు ప్రణయ్‌రెడ్డి వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సత్యనారాయణ, ఎర్రిస్వామి,ఎ ర్రిస్వామి నాయుడు, పెన్నహొబులేసు, నరసింహులు, మల్లికార్జున, రామాంజనేయులు, ధనుంజయ్య, రమేష్, బాలక్రిష్ణ,చిరంజీవి, వైఎస్సార్ సీపీ నేతలు బైరెడ్డి రామచంద్రారెడ్డి, శంకరయ్య, సిద్ధారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా చితంబరేశ్వరస్వామి రథోత్సవం..

కూడేరు మండలంలోని మరుట్ల–3కాలనీలో ఆదివారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన రామాంజనేయులు దీర్ఘకాలిక షుగర్ వ్యాధితో బాధపడుతూ కుడికాలు తొలగించిన నేపథ్యంలో కుటుంబానికి ఆసరాగా దాతలు నిత్యావసర సరుకులు అందజేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం దాతలు లేపాక్షి నవోదయ పూర్వ విద్యార్థులు రామకృష్ణ, సదాశివ నాయుడు సహకారంతో టీచర్ శశికళ నిత్యావసర సరుకులు, రూ.2 వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ నరసింహులు, రాప్తాడు రామాంజనేయులు, సొసైటీ ఉద్యోగి మారెప్ప, హోంగార్డు మారెప్ప, స్థానికులు దొణ తిమ్మప్ప, రామలక్ష్మి, హనుమంతు పాల్గొన్నారు.

25న క్రికెట్ టోర్నమెంట్

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు గ్రామంలో ఈనెల 25న శనివారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజర్లు భాస్కర్‌రెడ్డి,తలారి రాజప్ప ఆదివారం తెలిపారు. విన్నర్ జట్టుకు రూ. 50,000, రన్నర్ జట్టుకు రూ.25,000 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఎంట్రీ ఫీజు రూ.1100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి మ్యాచ్‌కు 10 ఓవర్లు ఉంటాయని, సెమీ ఫైనల్ మ్యాచ్‌లకు 12 ఓవర్లు, ఫైనల్ మ్యాచ్‌కు 14 ఓవర్లు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 7675095575, 8247782884 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

మెగా వైద్యశిబిరం రేపు

వజ్రకరూరు: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం కర్నూలులోని శాంతిరాం కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచితంగా కంటి, గుండె ఆపరేషన్లు, మోకాలు, భుజము, మెడిమ సమస్యలకు మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీ సభ్యురాలు తేజేశ్వరి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వశికెరి రమేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ వైద్యశిబిరం ఉంటుందన్నారు. మండలవాసులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పరామర్శ

కూడేరు: గొటుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజశేఖర్‌రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై అనంతపురంలోని సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యసేవలందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం



స్తంభాన్ని చుట్టేసిన పచ్చని చెట్టు



చెట్టును తొలగించిన దృశ్యం

రాయదుర్గం: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రధాన తీగలను పచ్చని కొమ్మలు చుట్టేశాయి. ఈ కారణంగా తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, ఉర్దూ మున్సిపల్ పాఠశాల ప్రహరీకి స్తంభం ఆనుకుని ఉండడం లాంటి ప్రధాన కారణాలు వెరసి గత కొంత కాలంగా కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పని ఒత్తిడి కారణంగా దాటవేస్తూ వచ్చారు. కాలనీకి చెందిన కొందరు మహిళలు ఆదివారం ఉదయం నేరుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కి ఫోన్‌చేసి సమస్యను వివరించారు. సత్వరం స్పందించిన విప్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను పంపి గంటల వ్యవధిలోనే సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో కాలనీ వాసులంతా ముక్తకంఠంతో విప్‌తో పాటు సీఎం జగన్‌కు అభినందనలు తెలిపారు.